

లెఫ్టా.. రైటే!
సమాజంలోని ప్రతీ వందమందిలో 90 మంది కుడిచేతివాటం వారు ఉండగా 10 శాతం లెఫ్ట్ హ్యాండర్స్ కనిపిస్తుంటారు. నేడు లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా కథనం. 8లో▸

69 సీట్ల భర్తీ
శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో 69 సీట్లను భర్తీ చేశారు. కాలేజీలో కౌన్సెలింగ్ తరువాత వివిధ బ్రాంచ్‌లలో 107 సీట్లు మిగిలాయి. వీటి భర్తీకి సోమవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 69 సీట్లు భర్తీ అయ్యాయని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.3 /27.4

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

స్వాహాకార సంఘాలు!

- సొసైటీలలో పెరుగుతున్న అక్రమాలు
- ఎరువులు, ధాన్యం సేకరణ, రుణాలు పంపిణీలో చేతివాటం
- రుణమాఫీ ఆరోపణలపై సొసైటీల్లో విచారణ
- చర్యలకు ఉన్నతాధికారుల వెనకడుగు



'మేము హాజీపూర్ మండలం పడ్తపల్లి సొసైటీలో కొన్నేళ్లుగా లోను తీసుకుని కడుతున్నం. రుణమాఫీ పథకంలో మొదటి విడుత, రెండో విడతలో మా సొసైటీలోని రైతులకు మాఫీ కాలేదు. అందరికీ లక్షన్నర లోపే ఉన్నా రెండు విడుతల్లో మాఫీ కాలేదు. సొసైటీ వాళ్లను, బ్యాంకు అధికారులను అడిగితే మాఫీ అయితయ్ అంటున్నరు. అందరితో కలిపి ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు' అని హాజీపూర్ మండలం పెద్దంపేట్ గ్రామ రైతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు.

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని సహకార సంఘాలు 'స్వాహా'కార సంఘాలుగా మారుతున్నాయి. అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయి. పాలకవర్గాలు, సిబ్బంది ఎవరికివారే యథేచ్ఛగా రైతుల పేరిట రుణాలు, ఎరువులు, నిధులు పక్కదారి పట్టిస్తున్నారు. ఏటా రైతులు తీసుకునే రుణాలపై ఆడిటింగ్ చేయడం లేదు. ఎరువుల విక్రయాల్లోనూ అదే తీరు కొనసాగుతోంది. సహకారం అందించాల్సిన అధికారులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. లక్షలాది రూపాయలు సొంతాని కి వాడుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత నెలలో ఓ సొసైటీలో రైతులకు విక్రయించిన ఎరువుల నగదు రూ.96,600 సొంతానికి వాడుకున్నాడు. విచారణలో అది బయటపడడంతో తిరిగి ఈ నెలలో చెల్లించినట్లు తెలుస్తోంది. గతంలో ఎరువులను పక్కదారిపట్టించడం, విక్రయించిన ఎరువులు నగదు సొసైటీకి చెల్లించకపోవడం, నిధుల దుర్వినియోగం, రైతుల పేరిట రుణాలు తీసుకుని సొంతానికి వాడుకోవడంతో పాలకరవర్గాలే రద్దయిన సందర్భాలూ ఉన్నాయి. సంఘాల అభివృద్ధికి, రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించాల్సిన సిబ్బంది, పాలకవర్గాలు అవినీతికి తెరలేపుతున్నారు. దీంతో సహకార సంఘాలపై రైతులకు నమ్మకం సన్నగిల్లుతోంది. అధికారులు పర్యవేక్షణ కొరవడడం, అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే అక్రమాలు పదేపదే జరుగుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

సొసైటీల్లో రుణమాఫీపై విచారణ..
రైతులకు సహకారం అందించేందుకు గ్రామస్థాయిలో 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేశారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా ఉండేందుకు పంట దిగుబడులను మద్దతు ధరకు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నారు. పంటల పెట్టుబడికి ఏడీసీసీ బ్యాంకు ద్వారా పంటలోన్లు కూడా ఇస్తున్నారు. జిల్లాలో 15 సొసైటీల్లో ఏడీసీసీ బ్యాంకు రుణాలు ఇస్తుండగా మరో ఐదు సీడెడ్ సొసైటీలు. హాజీపూర్ మండలం కర్ణమామిడి, పడ్తనపల్లి, లక్సెట్టిపేట మండలం గుల్లకోట, ఇటిక్యాల, గూడెంలో ఈ సీడెడ్ సొసైటీలు ఏర్పాటు చేశారు. ఈ ఐదు సొసైటీల పరిధిలోని రైతులకు ఎస్‌బీఐ ద్వారా పంట రుణాలు ఇస్తున్నారు. రైతుల పేరిట కాకుండా సొసైటీ పేరుమీద లోన్లు మంజూరు చేస్తున్నారు. సొసైటీకి వచ్చిన రుణాలను రైతులకు అందజేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పథకంలో నాలుగు సీడెడ్ సొసైటీల్లో రుణమాఫీ అమలు కాగా పడ్తనపల్లి సొసైటీలోని మొత్తం 276 మంది రైతులకు రుణమాఫీ పథకం జాబితాలో చోటు దక్కలేదు. దీంతో బాధిత రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మిగతా 15 సొసైటీల్లో కొంత మంది రైతులకు రుణమాఫీ కాగా, ఇందులో అసలు రుణాలు తీసుకోని రైతుల పేర్లు జాబితాలో రావడంతో వాళ్లు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని సొసైటీల్లో లోన్లపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిపై విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది.

మెస్సేజ్‌లతో వెలుగులోకి..
ఏళ్ల తరబడి రైతుల పేరుతో రుణాల రెన్యూవల్ అవుతున్నట్లు పేర్కొంటున్న సహకార శాఖ అధికారులు.. జిల్లాలో ఎన్ని సొసైటీల్లో ఎంత మంది రైతులు రుణాలు తీసుకున్నారనేది, ఎంత మందికి మాఫీ జరిగిందనేది లేక పోవడం గమనార్హం. దీంతోపాటు గత ప్రభుత్వం మాఫీ చేసిన కాకపోవడం, ప్రస్తుత ప్రభుత్వం రుణమాఫీ అమలులో భాగంగా రైతులకు మెస్సేజ్‌లు, రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రుణాలు తీసుకున్నా, అసలు రుణాలు తీసుకోని రైతులు మాఫీపై ఫిర్యాదు చేస్తున్నారు. మాకేందుకు రుణమాఫీ కాలేదని కొందరైతే.. మేము అసలు రుణాలే తీసుకోలేదు. రుణమాఫీ మెస్సేజ్‌లు ఎలా వచ్చిందని వ్యవసాయశాఖ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. మెస్సేజ్‌లకు రాకపోతే బయటకు వచ్చేది కాదని సొసైటీ సిబ్బందే కాజేశారని రైతులు ఆరోపిస్తున్నారు. రుణాలు తీసుకోవడంలో సొసైటీ పాలకవర్గాలు, సొసైటీల సభ్యులే ఉంటున్నట్లు తెలుస్తోంది.

ఆడిటింగ్ ఏదీ..?
ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకు సొసైటీల్లో జరిగే లావాదేవీలపై ఆడిటింగ్ నిర్వహించాలి. ఇందులో భాగంగానే రైతులు తీసుకునే పంట రుణాలపై సహకార శాఖ అధికారులు, ఏడీసీసీ బ్యాంకు అధికారులు ఆడిటింగ్ నిర్వహించాల్సి ఉంది. కానీ, ఆడిటింగ్ నామ్‌కే వస్తే అన్నట్లుగా సాగుతుంది. రైతుల పేరుతో సొసైటీ సిబ్బంది, పాలకవర్గాలు రుణాలు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతులు గతంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకపోవడం వల్ల వడ్డీతో సహా కలిపి ఏటా రెన్యూవల్ అవుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. కానీ రెన్యూవల్ సమయంలో రైతుల సంతకాలు కానీ, ఇతర ధ్రువపత్రాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి లేకుండా రైతులకు తెలియకుండా ఏళ్ల తరబడి రుణాలు రెన్యూవల్ చేస్తున్నట్లు తెలపడం గమనార్హం. ప్రతీ రైతు రుణంపై ఇటు సహకార శాఖ ఆడిట్ అధికారులు, ఏడీసీసీ బ్యాంకు అధికారులు ఆడిటింగ్ చేయాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండానే ఏళ్ల తరబడి రుణాలు రెన్యూవల్ కావడం అనుమానాలకు తావిస్తోంది.

సొసైటీ రుణాల విచారణ..



సొసైటీ ద్వారా రైతులు తీసుకున్న పంట రుణాలు, రెన్యూవల్, ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ ఆరోపణలపై జిల్లాలోని సొసైటీల్లో విచారణకు ఆదేశించాం. విచారణ ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– బి.రామ్మోహన్, జిల్లా సహకార శాఖ అధికారి

న్యూస్‌రీల్

జైలు అదాలత్‌ను వినియోగించుకోవాలి

- జూనియర్ సివిల్‌జడ్జి అసద్ ఉల్లా షరీఫ్



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

లక్సెట్టిపేట: అండర్ ట్రయల్ ఖైదీలు జైలు అదాలత్‌ను వినియోగించుకోవాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసద ఉల్లా షరీఫ్ సూచించారు. మండల కేంద్రంలోని సబ్ జైల్‌లో ఏర్పాటు చేసిన జైలు అదాలత్‌లో మాట్లాడారు. జైలు అదాలత్‌లో నేరం చేసినట్లు ఒప్పుకుంటే వారిని జరిమానాతో విడుదల చేయడం జరుగుతుందన్నారు. అండర్ ట్రయల్ ఖైదీలుగా శిక్ష అనుభవిస్తూ న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్తోమత లేని వారికి కోర్టు ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. జైలులో క్రమశిక్షణతో ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం సబ్‌జైల్‌లో పరిసరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రవీందర్, జైలర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నరహరిశర్మకు సౌత్ ఇండియా అయ్యప్ప సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న నరహరిశర్మ

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథస్వామి ఆలయ అర్చకుడు సంగనభట్ల నరహరిశర్మకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ (ఏబీఏపీ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియా అయ్యప్ప సేవారత్న అవార్డు ప్రదానం చేసింది. ఈనెల 11న తమిళనాడులోని కాంచీపురంలో ఏబీఏపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో దక్షిణా భారతదేశంలో 18 మంది సీనియర్ అయ్యప్ప గురుస్వాములకు అయ్యప్ప సేవకులుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా నరహరిశర్మకు అయ్యప్ప సేవారత్న అవార్డును ఏబీఏపీ జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్‌రావు చేతుల మీదుగా అందజేశారు.

నిలకడగా 'ఎల్లంపల్లి' నీటిమట్టం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్టు నీటి మట్టం ప్రస్తుతం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా సోమవారం 145.56 మీటర్లు ఉంది. 20.175 టీఎంసీలకు గాను 13.890 టీఎంసీలుగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3,580 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్ట్‌లోకి వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వార్క్స్ పథకానికి 309 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులతోపాటు నంది పంప్‌హౌస్‌కు 3,150 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.

హోంగార్డుల వేతనాలు పెంచాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న విజయ్‌కుమార్

మంచిర్యాలటౌన్: హోంగార్డులకు ప్రతి నెల రూ.27,630 జీతం వస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో అవి సరిపోవని, వేతనాలు పెంచాలని బీజేపీ జిల్లా నాయకులు లింగంపల్లి విజయ్‌కుమార్ కోరారు. ఈమేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. తక్కువ జీతంతో పనిచేస్తున్న హోంగార్డుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు.

సీఎస్సీ హెల్త్ కేర్‌లో నియామకాలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని మండలాల వారీగా సీఎస్సీ హెల్త్ కేర్ వెలనెస్ కేంద్రాల్లో ప్లేబోటమిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ల ఉద్యోగాల భర్తీకి జిల్లావ్యాప్తంగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ కొండల్‌రావు, డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో సీఎస్సీ హెల్త్‌కేర్ ఆఫీసు, కోర్టు చౌరస్తా, కరీంనగర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ ఎంఎల్‌టీ, ఏఎన్ఎం, జీఎన్ఎంలలో ఉత్తీర్ణత సాధించి, పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకుని ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9989165691, 8977776143 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నకిలీ జర్నలిస్టులపై చర్యలు

- డీసీపీ భాస్కర్



డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో కొంత మంది జర్నలిస్టుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలంటూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు డేగ సత్యంతోపాటు సభ్యులు డీసీపీ భాస్కర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఇటీవల నకిలీ జర్నలిస్టులు బెదిరింపులకు పాల్పడి, వసూళ్లకు పాల్పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. విలేకరుల పేరు చెప్పి విద్యా సంస్థలు, ఇతర సంస్థలకు ఫోన్లు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే నకిలీ విలేకరులపై కేసులు పెట్టామన్నారు. ఎవరైనా విలేకరులమని బెదిరింపులకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జర్నలిస్టుగా పనిచేయని వారు తమ ద్విచక్రవాహనాలపై, కార్లపై ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని తిరిగితే ఎంవీఐ యాక్ట్ ప్రకారం చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

'అటవీ అధికారులపై చర్య తీసుకోవాలి'

నెన్నెల: నార్వాయిపేటలో దళిత రైతు జాడి మల్లేశ్‌కు చెందిన 150 మామిడి చెట్లను నరికి వేసిన అటవీ అధికారులపై చర్య తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేసిన మామిడి తోటను అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, మండల నాయకులతో కలిసి సోమవారం సందర్శించారు. 15 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలో 4 ఏళ్లుగా పెంచుకుంటున్న మామిడి చెట్లను రాత్రికి రాత్రి నరికివేసి రైతుకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. నష్టపోయిన రైతుకు వెంటనే పరిహారం అందజేసి అదే భూమిలో ప్రభుత్వం మామిడి మొక్కలు నాటాలన్నారు. గతంలో మంత్రి సీతక్క పోడు భూ ములపై అసెంబ్లీలో మాట్లాడిన మాటలను గుర్తు చేశారు. దళిత రైతుకు అన్యాయం జరిగితే దళితుడైన స్థానిక ఎమ్మెల్యే కనీసం పరామర్శకు రాలేదన్నారు. బాధిత రైతు మల్లేశ్‌కు అండగా నిలుస్తామని, న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వంశీ, అసెంబ్లీ కన్వీనర్ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

వర్షం.. సాధారణం!

- ఐదు మండలాల్లో అధికం..
- నిండిన చెరువులు, ప్రాజెక్టులు
- గోదావరికి చేరని పూర్తిస్థాయి వరద

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఈ వర్షకాలంలో జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. జూన్‌లో తొలకరి నుంచే కొంత ఆలస్యంగా వర్షాలు కురిశాయి. గత జూలైలోనే అధిక వర్షపాతం నమోదైంది. గతేడాదితో పోలిస్తే ఈసారి తక్కువగానే వర్షపాతం నమోదైంది. మొత్తం 18 మండలాల పరిధిలో కాసిపేట, వేమనపల్లి, జైపూర్, చెన్నూరు, కోటపల్లి మండలాల్లోనే సగటు కంటే అధిక వర్షపాతం ఉండగా, మిగతా మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. ఇప్పటి వరకు జిల్లా సగటు వర్షపాతం 630 మి.మీ. కాగా, 598.1 మి.మీలు కురిసింది. ఈ ఏడాది సమృద్ధిగానే వర్షాలు కురిసినట్లుగా అధికారులు చెబుతున్నారు.

చెరువులు, కుంటలకు జలకళ
జిల్లాలో దాదాపు అన్ని చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. గత నెలలో కురిసిన వానలతో దాదాపు అన్ని చెరువులు, కుంటలు మధ్యతరహా ప్రాజెక్టుల్లోకి పూర్తిస్థాయిలో నీరు చేరింది. ప్రాణహితకు వరద పోటెత్తింది. అయితే గోదావరి తీరానికి మాత్రం భిన్న పరిస్థితి ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇంకా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండలేదు. ఎగువన గోదావరినదికిపై నుంచి ప్రవాహం లేకపోవడంతో ఇంకా ఈ ప్రాజెక్టు గేట్లు ఎత్తాల్సిన అవసరం ఏర్పడలేదు. గత సీజన్‌లో ఇప్పటికే గేట్లు ఎత్తి అధికారులు నీటిని కిందకు వదిలారు. సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13 టీఎంసీలకు చేరింది. హైదరాబాద్ నగరానికి తాగు నీటికి, ఎన్టీపీసీ, నందిపంపుహౌస్‌కు 3,580 క్యూసెక్కుల నీటి తరలిస్తున్నారు.

మధ్యతరహా/భారీ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ వివరాలు
(సామర్థ్యం, నిల్వ టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో)

ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఎల్లంపల్లి	20.17	13.89	3,580	3,580
ర్యాలీ వాగు	0.408	0.398	30	30
గొల్లవాగు	0.5675	0.4505	139	0
నీల్వాయి	0.846	0.846	139	139



నిండుగా నీల్వాయి ప్రాజెక్టు

ఈ నెల 12 వరకు జిల్లాలో నమోదైన వర్షపాత వివరాలు (మి.మీలలో..)

మండలం	సాధారణం	నమోదైంది
జన్నారం	566.9	672.0
దండేపల్లి	525.4	577.3
లక్సెట్టిపేట	518.8	575.5
హాజీపూర్	510.5	595.8
కాసిపేట	748.3	565.6
తాండూరు	483.0	541.2
భీమిని	572.1	626.2
కన్నెపల్లి	694.1	628.1
వేమనపల్లి	874.8	620.8
నెన్నెల	519.7	598.8
బెల్లంపల్లి	636.0	548.1
మందమర్రి	537.1	567.4
మంచిర్యాల	516.4	592.0
నస్పూర్	684.6	590.5
జైపూర్	769.3	624.9
భీమారం	624.8	610.2
చెన్నూరు	808.0	630.7
కోటపల్లి	751.2	600.7
జిల్లా సగటు	630.1	598.1

సమస్యలపై సత్వరం స్పందించాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల అగ్రికల్చర్: వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చే బాధితుల అర్జీల పరిష్కారానికి అధికారులు సత్వరం స్పందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి అర్జీలు స్వీకరించారు. భూసమస్యలు, ఫించన్, పరిహారం, రుణమాఫీ తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

- జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన సంకె మల్లయ్య తనకు గ్రామ శివారులో భూమికి సంబంధించిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.
- హాజీపూర్ మండలం గుల్లకోట గ్రామానికి చెందిన జి.మల్లేశ్, ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో తాను కోల్పోయిన భూమికి సంబంధించి పరిహారం అందించాలని అర్జీ సమర్పించాడు.
- బెల్లంపల్లి పట్టణానికి చెందిన మేడి శ్రీనివాస్ తాము కన్నాల శివారులో భూమి కొనుగోలు చేశామని, ఈ వివరాలు ధరణిలో నమోదు చేసి పాస్ పుస్తకం ఇప్పించాలని అర్జీ అందించాడు.
- దండేపల్లి మండలం కనెపల్లి గ్రామానికి చెందిన తోట లక్ష్మయ్య తనకు గ్రామ శివారులో ఉన్న భూమి ధరణిలో కనిపించడం లేదని, ఈ విషయంలో న్యాయం చేయాలని కోరుతు అర్జీ పెట్టుకున్నాడు.
- **కాసిపేట:** మండలంలోని కొత్తవారిపేట, పాతవారిపేట గ్రామాలను కలిసి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.


పందిరి సామగ్రి ఇప్పించండి



ఉపాధి హామీ పథకంలో పెండల్స్(కూరగాయల పందిరి), వర్మీకంపోస్టు యూనిట్ మంజూరు కోసం ఆరు నెలల కింద దరఖాస్తు చేసుకున్న. దండెపల్లి శివారులోని సర్వే నంబర్ 212/ లో ఎకరం భూమి ఉంది. అందులో కూరగాయల సాగు చేసుకునేందుకు సేంద్రియ ఎరువుల తయారీ చేయడానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద (జాబ్ కార్డు నెం 342450805010010514) ద్వారా కూరగాయల పందిరి వర్మీకం పోస్టు మంజూరు చేయాలని పలు మార్లు విన్నవించిన యూనిట్ మంజూరు కాలేదు.

– బొమ్మన మహేశ్, దండేపల్లి

న్యాయం చేయండి



26 సంవత్సరాల క్రితం మానాన్న జగదీశ్వర్‌సింగ్(మున్నసింగ్‌ను) నెన్నెలలో మా ఇంటి వద్దనే నక్సలైట్లు హతమార్చారు. నక్సలైట్ బాధిత కుటుంబాలకు అందించే ఆర్థిక సహాయం, ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఏళ్ల తరబడి ఉద్యోగం, సహాయం కోసం తిరుగుతున్నాను. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో ప్రకారం ఇంత వరకు మాకు సమాచారం రాలేదు. గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశాను. ఇప్పటికైన అధికారులు గుర్తించి న్యాయం చేయాలి

– ఠాకూర్ అరుణ్‌సింగ్, నెన్నెల

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వాతంత్య్ర వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీసీపీ, ఆర్డీవో, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు సమన్వయంతో పరేడ్ గ్రౌండ్ ఏర్పాట్లు, ఆర్డీవో డీఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు సమన్వయంతో ప్రోటోకాల్ ప్రకారం సీట్లు, వేదిక, కుర్చీలు, టెంట్లు, షామియానాలు సౌండ్‌సిస్టమ్ ఏర్పాట్లు, తాగునీరు, గ్రౌండ్‌వాటరింగ్, బెల్లంపల్లి ఏసీపీ, డీఈవో, డీఐఈవో సమన్వయంతో జాతీయ గీతాలాపన, పోలీస్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలు, డీసీపీ, బెల్లంపల్లి ఏసీపీ ఆర్ఐ(ఏఆర్)ఆధ్వర్యంలో జాతీయ పతాక ఏర్పాట్లు, జిల్లా పౌరసంబంధాల అధికారి ఆధ్వర్యంలో ప్రసంగ ప్రతి తయారీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షకులు, తహసీల్దార్లు, కమిషనర్లు సమన్వయంతో ఆహ్వాన పత్రికల ముద్రణ, పంపిణీ, ప్రశంసాపత్రాలు తయారు చేయాలన్నారు. అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, మత్స్య, పశుసంవర్ధక, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి పారుదల, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, అబ్కారీ, అగ్నిమాపక, ఇంటర్మీడియట్ విద్య, వయోజన విద్య, పరిశ్రమ, ఎస్సీసెల్, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంక్షేమాభివృద్ధి పథకాలు ప్రదర్శించేలా శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రశంసా పత్రాలకు వచ్చిన ప్రతిపాదనలను జిల్లా అదనపు కలెక్టర్, గ్రామీణాభివృద్ధి అధికారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి, ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షకుల ఆధ్వర్యంలో పరిశీలించి, అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. వేడుకల్లో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులు, సిబ్బంది స్వచ్ఛంద సంస్థలు, సామాజిక ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. స్వాతంత్య్ర వేడుకలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి చేయాలి
మహిళలు, యువతులు, బాలికల సంక్షేమానికి అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి స్వరూపారాణితో కలిసి సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సఖీ ఉమెన్ హబ్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సఖీ కేంద్రానికి వచ్చే కేసులను పరిశీలించి వారి పరిధి వరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పిల్లల సంరక్షణ, బాల్య వివాహాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. పోషణ్ అభియాన్ పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల మానసిక, శారీరక ఎదుగదలను పర్యవేక్షిస్తూ అవసరమైన పోషణ చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధుల పోషణ నిర్లక్ష్యం, వేధింపుల సహాయానికి ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 14567 సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లను గుర్తించి గుర్తింపుకార్డులు అందించాలన్నారు. లైసెన్స్ లేని స్కానింగ్ సెంటర్లను గుర్తించాలని తెలిపారు.

రైల్వే కార్మికుల ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు చేయాలి



నిరసనలో రైల్వే మజ్దూర్ యూనియన్ శ్రేణులు

బెల్లంపల్లి: రైల్వే కార్మికుల ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ యూనియన్(హెచ్ఎంఎస్) బ్రాంచ్ చైర్మన్ ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు బెల్లంపల్లిలో రైల్వే కార్మికులు దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజువారీగా పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రైల్వే కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. వేతన సవరణ ఆలస్యం అవుతుండటంతో కార్మికులు తీవ్ర వేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైల్వే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ఇవ్వాల్సిన 18 నెలల డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. రైల్వే కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిరసనలో దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సెక్రెటరీ సాంబశివుడు, కోశాధికారి సోకేశ్‌మీనా, సంఘం సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రామకృష్ణాపూర్: పట్టణంలోని రవీంద్ర ఖని రైల్వేస్టేషన్ నుండి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సోమవారం రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ నుండి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు సుమారు 20 క్వింటాళ్ల బియ్యంను పట్టుకుని మంచిర్యాలకు తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

లింగాపూర్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పిక్లాతండాకు చెందిన మాలోత్ బాలు (74) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయత్రం పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబం సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య మాలోత్ సతీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంకు సిబ్బందికే బురిడీ


మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బీచౌరస్తా వద్ద ఉన్న ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బందిని బురిడీ కొట్టించి రూ.50 వేలు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి బ్యాంకులోకి వెళ్లి ఐటీ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చానని సిస్టం అప్‌డేట్ చేయాలని నమ్మబలికాడు నిజమే అనుకున్న బ్యాంకు సిబ్బంది నమ్మి క్యాష్ కౌంటర్‌లో ఓ కంప్యూటర్‌ను అప్పగించారు. దానిని అప్‌డేట్ చేసినట్లు నటించాడు. బ్యాంకు సిబ్బంది ఎవరిపనిలో వారు ఉండగా క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.50 వేలు తీసుకుని వెళ్లిపోయాడు. కాసేపటికి సిబ్బంది తేరుకుని వ్యక్తి కోసం చూడగా కనిపించలేదు. క్యాష్ కౌంటర్‌కు వెళ్లి చూడగా రూ.50 వేలు కనిపించలేదు. దీంతో మోసపోయామని గుర్తించారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని మంగి గ్రామానికి చెందిన మడావి సుకుమార్ (21) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 11న ఉట్నూర్ వెళ్తానని ఇంట్లో తల్లికి చెప్పి వెళ్లి అదేరోజు సాయంత్రం ముత్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి పురుగుల మందుతాగి తల్లికి సమాచారం అందించాడు. వెంటనే తల్లి గౌరుబాయి ముత్నూర్‌లో ఉన్న బంధువులకు ఫోన్‌చేసి విషయం చెప్పడంతో ప్రైవేటు వాహనంలో రిమ్స్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. ఎస్సై సోమవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. గౌరుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



లెఫ్ట్టా.. రైటే!



మామడ మండలంలోని పరిమండల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు

- కొందరికి పుట్టుకతోనే ఎడమచేతి వాటం..
- లెఫ్ట్ హ్యాండర్సే ప్రత్యేక ప్రతిభావంతులంటున్న నిపుణులు
- ప్రత్యేకత చాటుతున్న లెఫ్ట్ హ్యాండర్స్
- నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే

నిర్మల్‌ఖిల్లా: సాధారణంగా సమాజంలోని ప్రతీ వ్యక్తి ప్రత్యేక భిన్నమైన గుణం కలిగి ఉంటాడు. అయితే కొందరిలో వారి ప్రత్యేకతను బట్టి ఇట్టే గుర్తుపట్టొచ్చు. ప్రతీ వందమందిలో 90 మంది కుడిచేతివాటం వారు ఉండగా మిగతా 10 శాతం మంది లెఫ్ట్ హ్యాండర్స్ కనిపిస్తుంటారు. కుడిఎడమైతే పొరపాటు లేదోయ్.. అన్నాడో సినీ కవి.. అంటే వ్యక్తిలోని భిన్నత్వాన్ని బట్టి ఆ వ్యక్తికి ప్రత్యేకతను ఆపాదిస్తాం. ఎడమ చేతివాటం అనేది జన్యు ప్రభావ ఫలితంగా ఏర్పడిందని వైద్య పరిశోధనల్లో రుజువైంది. నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా కథనం.

భిన్నమైన శైలి...

కుడిచేతివాటం వారి కన్నా ఎడమచేతివాటం వారు ప్రత్యేక స్థానాల్లో ఉంటారని, వారి మేధోశక్తి ఆలోచనలు, తెలివితేటలు భిన్నంగా ఉంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో గుర్తింపు పొందిన మేధావుల్లో చాలామంది ఎడమ చేతి వాటం కలిగిన వారే కావడం విశేషం. ప్రస్తుత భారత ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఎడమ చేతితోనే రాస్తారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, యువరాజు సింగ్, సినీ నటులు అమితాబ్ బచ్చన్, సావిత్రి లాంటివారు లెఫ్ట్ హ్యాండర్స్ వారే కావడం గమనార్హం. ఎడమచేతి వాటం వారిలో సృజనాత్మకత, సంగీతం, కళలు, అభినయం, గ్రహణశక్తి సామర్థ్యాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అమితంగా ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

మాన్పించవద్దు..

ఏడాదిన్నర నుంచి రెండేళ్ల మధ్య వయసులో ఉన్నప్పటి నుండి పిల్లలు వస్తువులను పట్టుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే కుడి, ఎడమ చేత వాటాలను గుర్తించవచ్చు. ఎడమ చేతి వాటాన్ని తల్లిదండ్రులు ఒక చెడు అలవాటుగా భావించి మాన్పించేందుకు ప్రయత్నం చేస్తారు. అలా చేయడం వల్ల ఇతర సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కుడి చేత్తో రోజువారి పనులు చేసుకోవడం సహజమే. అయితే ఆ పనులను ఎడమ చేత చేయడం కాస్త ఛాలెంజ్‌తో కూడుకున్నది. రోజువారీ పనులన్నీ ఎడమచేత్తో చేస్తూ ప్రత్యేకంగా పేరొందిన వారి జాబితాలో మనదేశం చాలా పెద్దది. అందులో సైంటిస్టులు, క్రీడాకారులు, తత్వవేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయవేత్తలు చాలామంది ఉన్నారు. ప్రతి 10 మందిలో ఒకరు ఎడమ చేతివాటం ఉన్న వారేనని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

జన్యు ప్రభావ ఫలితంగానే...

ప్రతీ వ్యక్తి పుట్టినప్పటి నుండే కుడి, ఎడమ చేతి వాటాలను సహజసిద్ధంగానే కలిగి ఉంటాడని సైన్స్ చెబుతోంది. ఒక మనిషికి మెదడు కుడి ఎడమ రెండు అర్ధ భాగాలుగా ఉంటుంది. కుడి వైపు శరీర భాగాన్ని మెదడు ఎడమవైపు భాగం నియంత్రిస్తుందని, కుడి అర్ధ భాగం మెదడు బలంగా ఉన్న వారిలో ఎడమ చేతి వాటం వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. చిన్నప్పటినుండే తల్లిదండ్రులు ఎడమ చేతి వాటం గమనిస్తే మాన్పించేందుకు ప్రయత్నం చేస్తారు. జన్యుపరమైన మార్పులు ఉన్నప్పుడు అలా మాన్పించడం సాధ్యంకాదు.

ఒకే తరగతిలో ఐదుగురు...

నిర్మల్ జిల్లా మామడ మండలం పరిమండల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతిలో దాదాపు 22 మంది ఉండగా అందులో ఐదుగురు ఎడమ చేతి వాటం కలిగిన వారే ఉండడం విశేషం. వీరు హోం వర్క్, పెయింటింగ్స్, రాతపని ఏది చేయాలన్నా ఎడమ చేతితోనే చేస్తారు. శ్రీకృతి, శ్రీహరి, సిద్ధార్థ, సమాధాన్, వర్షిత్ అనే పదేళ్లలోపు చిన్నారులతో పాటు మరో ముగ్గురు విద్యార్థులు ఎడమ చేతి వాటం కలిగి ఉన్నారు. వారంతా చదువు, రాత పనుల్లో చురుకుదనం, భిన్నమైన శైలిని కలిగి ఉన్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అందమైన చేతిరాతతో పాటు డ్రాయింగ్, పెయింటింగ్‌లో నైపుణ్యం కలిగి ఉన్నారు.

జన్యు ప్రభావంతోనే..



గర్భస్థ దశలో శిశువు ఉన్నప్పుడు ఏర్పడిన జన్యు ప్రభావంతోనే ఎడమచేతివాటంతో జన్మిస్తారు. పుట్టిన పృటి నుండే ప్రతీపనిని ఎడమచేతితో చేసేందుకు ప్రయత్నిస్తారు రెండేళ్ల తర్వాత తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించవచ్చు. దానిని మాన్పించే ప్రయత్నం చేయకూడదు. ఎడమ చేతివాటం ఉండడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

– నాలం స్వప్న,
చిన్న పిల్లల వైద్య నిపుణులు, నిర్మల్


ఊహ తెలిసినప్పటి నుంచి..



నాకు ఊహ తెలిసిన ప్పటి నుంచి లెఫ్ట్ హ్యాండ్ తోనే రాయడం, ఇతర పనులు చేయడం అలవాటైంది. తల్లిదండ్రులు కూడా ఎడమచేతివాటాన్ని ప్రోత్సహించారు. ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ అలవాటును ఇలాగే కొనసాగిస్తున్నా.

– మాకునూరి గిరిబాబు,
కంప్యూటర్ ఆపరేటర్, సిర్గాపూర్

ఎడమ చేతితోనే ...



ప్రస్తుతం నేను ప్రైవేటు ఉద్యోగిగా అకౌంట్స్ పనులు నిర్వహిస్తున్నా. చిన్నప్పటినుండి ఎడమ చేతితోనే రాయడం, పనులు చేయడం అలవాటైంది. కుడి చేతి కంటే కూడా ఎడమ చేతికి చలన నైపుణ్యాలు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఏ పని చేయాలన్నా సహజ సిద్ధంగానే ఎడమచేయి ముందుకు వెళ్తుంది. ఏ పని మొదలెట్టినా ఎడమ చేతితోనే చేస్తాను.

– గాండ్ల లక్ష్మణ్, ప్రైవేటు ఉద్యోగి, కౌట్ల

నకిలీ విలేకరిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

జన్నారం: ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన నకిలీ విలేకరి తిరుపతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య మాట్లాడుతూ రోజురోజుకూ నకిలీ విలేకరుల బెడద పెరుగుతోందని, దీంతో అసలైన విలేకరులకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

108లో మహిళ ప్రసవం



శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని కర్జీ గ్రామానికి చెందిన డోబె రమాదేవికి పురిటి నొప్పులు రావడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో మంచిర్యాల మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేశారు. 108లో గర్భిణిని మంచిర్యాలకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్సును పక్కనే ఆపి ఈఎంటీ శహబాజ్ సుఖ ప్రసవం చేయడంతో మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడంతో మంచిర్యాల ఎంసీహెచ్‌కు తరలించినట్లు పైలట్ రంజిత్ తెలిపారు. శహబాజ్, రంజిత్‌లను 108 మంచిర్యాల జిల్లా కార్య నిర్వాహక అధికారి సంపత్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ అభినందించారు.

భళా.. ఉపాధ్యాయుని కళ



బొమ్మకు రంగులు వేస్తున్న ఉపాధ్యాయుడు

- పాఠం చెబుతూ తీరిక సమయంలో బొమ్మలు గీస్తూ
- పాఠశాలను రంగులమయం చేసిన ఉపాధ్యాయుడు

జన్నారం: విద్యార్థులకు జ్ఞానాన్ని ఇచ్చే సూక్తులతో పాటు, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు, ఇతర బొమ్మలు గీస్తూ భళా అనిపించుకుంటున్నాడు కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు. జన్నారం మండలం కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హిందీ ఉపాధ్యాయునిగా సూర్యవంశీ నాగోరావు ఇటీవల బదిలీపై వచ్చాడు. తనకున్న ఆర్ట్ పరిజ్ఞానంతో పాఠశాలను రంగులమయం చేయాలనుకున్నాడు. విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి దృష్టికి తీసుకెళ్లగా ఆయన రంగులు తెప్పించాడు. ఒకవైపు విద్యార్థులకు పాఠాలు చెబుతూనే ఖాళీ సమయంలో, సెలవు రోజుల్లో గోడలపై బొమ్మలను గీశాడు. సరస్వతి, స్వామి వివేకానంద, భారతదేశ పటం, స్వాతంత్ర్య సమరయోధులు, కవులు లాంటి చిత్రాలు, విద్యార్థులను ఆలోచింపజేసే కొటేషన్లు, గణితానికి సంబంధించిన విషయాలు గోడలపై వేసి ఔరా అనిపించుకుంటున్నాడు.



ఉపాధ్యాయుడు వేసిన చిత్రాలు

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌కు చెందిన గేడం శశిరేఖ ఉద్యోగ అవకాశం కల్పించాలని, నార్నూర్ మండలం గంగాపూర్‌కు చెందిన చౌహాన్ బన్ని ల్యాప్‌టాప్ ఇప్పించాలని, వాంకిడి మండలం లింగూడకు చెందిన ఆత్రం రాము ఇల్లు మంజూరు చేయించాలని, మామడ మండలానికి చెందిన లక్ష్మి తమ భూమికి పట్టా చేయించాలని అర్జీలు అందజేశారు. ఇంకా పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, జీసీసీ డీఎం రామనందన్, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఆర్సీవో రాజ్యలక్ష్మి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

హామీలు అమలు చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు నందిరామయ్య మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు డబుల్ బెడ్ రూం, కొత్త రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 12 రకాల నిత్యవసర సరుకులు, గృహనిర్మాణినికి రూ.10 లక్షల ఆర్థికసాయం తదితర హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆగస్టు నెల వచ్చినా రైతుభరోసా ఇవ్వలేదన్నారు. కౌలు రైతులు, రైతులకు వెంటనే రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు టి.రమాదేవి, బాపురావ్, అదిలక్ష్మి, వైశాలి, లక్ష్మి, స్వరూప, రాజేందర్, పార్వతి, సుశీల, మొండక్క తదితరులు పాల్గొన్నారు.

పీవో బాధ్యతల స్వీకరణ



పీవో ఏవీరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: ఇందారం ఐకే ఓసీ ప్రాజెక్ట్ అధికారిగా ఏవీ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, అధికారులు పీవోను సన్మానించి ఘన స్వాగతం పలికారు. గతంలో ఆర్కే 5 గ్రూప్ ఏజెంట్‌గా పని చేసిన ఏవీ రెడ్డి పదోన్నతిపై ఐకే ఓసీ ప్రాజెక్ట్‌కు వచ్చారు.

రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు



కనపర్తి రమేశ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కనపర్తి రమేశ్‌ను అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, గోనె శ్యాంసుందర్‌రావును రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాజలింగు, అలువెల్లి రమేశ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హ్యాట్సాఫ్ పోలీస్



మహిళను పీహెచ్‌సీకి తరలిస్తున్న పోలీసులు

రెబ్బెన: పోలీసులంటే ప్రజలకు రక్షణ కల్పించడమే కాదు ఆపదలో ఉన్న వారి పట్ల ఔదార్యం చాటుతారని నిరూపించారు. గోలేటికి చెందిన జిల్లాల సుజాత తన సమస్య విన్నవించేందుకు సోమవారం మండల కేంద్రం లోని పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. ఎస్సైని కలిసేందుకు హాల్‌లో నిరీక్షిస్తున్న సమయంలో ఒక్కసారిగా కిందపడిపోయింది. వెంటనే ఫిట్స్ సైతం రావటంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది మహిళను చేతుల పైకి ఎత్తుకుని పక్కనే ఉన్న పీహెచ్‌సీకి పరుగు తీశారు. పీహెచ్‌సీ సిబ్బంది బాధిత మహిళకు ప్రథమ చికిత్స అందించారు. మండల ప్రజలు హ్యాట్సాఫ్ పోలీస్ అని అభినందించారు.

మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

- ఉద్యోగాల పేరిట మోసం చేశాడని కేసు నమోదు
- ఓ కౌన్సిలర్ చెబితే చేశానంటున్న బాధితుడు



చికిత్స పొందుతున్న నవీన్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న మడుగుల నవీన్ సోమవారం తన ఇంట్లో నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మడుగుల నవీన్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నాడు. మున్సిపాలిటీలో ఉద్యోగాలు పెట్టిస్తానని 8 మంది నుంచి రూ.55 చొప్పున వసూలు చేశాడు. ఉద్యోగం పెట్టించకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో మోసం చేశాడంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు నవీన్‌పై కేసు నమోదైంది. మరోవైపు డబ్బులు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో వసూలు చేసిన డబ్బులను కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణకు ఇచ్చానని తెలిపాడు. బాధితుల ఒత్తిడి, పోలీస్ కేసు, కౌన్సిలర్ పేరు చెప్పడంతో మరింత ఒత్తిడి పెరగడంతో సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయమై కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణను వివరణ కోరగా నవీన్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. ఈ విషయమై కాంట్రాక్ట్ కార్మికుల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేసి నవీన్‌ను నిలదీశామని పేర్కొన్నాడు. దీంతో నవీన్ ఎలాంటి సమాధానం చెప్పకుండా ఈనెల 11న ఆత్మహత్య చేసుకుంటానని సోషల్ మీడియాలో బ్లాక్‌మేల్ చేశాడని హరికృష్ణ ఆరోపించాడు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఇది వరకే నవీన్‌పై కేసు నమోదు అయిందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని సీఐ బన్సీలాల్ తెలిపారు.

జీఎం ఆఫీస్‌లో గ్రీవెన్స్ డే

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్‌లో గల కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి సింగరేణి డైరెక్టర్ (పా) శ్రీనివాస్ హాజరై ఏరియాలోని ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా సర్వీస్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు నేరుగా అధికారులకు తెలియజేయడంతో వెంటనే పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, ఏజీఎం (ఈ అండ్ ఎం) నాగరాజు, ఆర్కే ఓసీ పీవో గోవిందరావు, కేకే ఓసీ పీవో రమేశ్, డీజీఎం(సివిల్) శ్రీనివాసులు, కేకే గ్రూపు ఏజెంట్ రామదాసు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగి సమస్య వింటున్న సింగరేణి డైరెక్టర్

నిరుపేదకు పెద్ద ఆపద

- 800ల గ్రాముల బరువుతో జన్మించిన చిన్నారి
- చికిత్స కోసం లక్షల్లో ఖర్చు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

చెన్నూర్: నిరుపేద కుటుంబానికి చెందిన నిరుద్యోగికి పెద్ద ఆపద వచ్చింది.తండ్రిని కాబోతున్నానని సంతోషంతోఉన్నచెన్నూర్‌పట్టణానికి చెందిన చకినారపు కిరణ్‌కు ఆపద ఎదురొచ్చింది.

నెలలు నిండకముందే ..

చెన్నూర్‌కు చెందిన కిరణ్ భార్య స్రవంతి ఏడునెలల గర్భిణి. ఈ నెల 6న ఆమెకు అధిక రక్త స్రావం కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సదరు మహిళకు నెలలు నిండకముందే ఆపరేషన్ చేసి కాన్పు చేయడంతో 800 గ్రాముల బరువుతో ఉన్న పాప జన్మించింది. దంపతులిద్దరికీ పాప పుట్టిందనే సంతోషం లేకుండా పోయింది. గతేడాది కూడా బాబు పుట్టి చనిపోయాడు. ఈ సారైనా ఆరోగ్యంగా బిడ్డ పుడుతుందని ఆశపడ్డారు. నెలలు నిండకుండా పుట్టిన బిడ్డను కాపాడుకునేందుకు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు.



ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న దంపతులు

వెంటిలేటర్‌పై చికిత్స ..

పాప బరువుతో పాటు ఆర్గన్స్ పెరిగేందుకు వెంటిలేటర్‌పై ఉంచి 30 నుంచి 40 రోజులపాటు చికిత్స అందించాలి. ఇందుకు రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొన్నారు. భార్య చికిత్సకోసం ఇప్పటికే రూ.2 లక్షల వరకు ఖర్చు చేసిన కిరణ్ మరో రూ.8 లక్షలు ఎక్కడి నుంచి తీసుకురావాలని ఆందోళన చెందుతున్నాడు. భార్యపై ఉన్న నగలు విక్రయించి ఇప్పటి వరకు చిన్నారి వైద్యం కోసం రూ.2.60 లక్షలు చెల్లించారు. మరో రూ.6 లక్షలు చెల్లించేందుకు ఆర్థికస్తోమతలేని ఆ దంపతులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి చేయూతనందించాలని వేడుకుంటున్నారు. దయార్ధ హృదయులు చకినారపు కిరణ్ 7989570165 నంబర్‌కు తమకు తోచినంత సాయం ఫోన్‌పే చేయాలని వేడుకుంటున్నారు.



ఇంక్యుబేటర్‌లో చిన్నారి